క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐలు


వరప్రసాద్, రూరల్ సీఐ, రాయచోటి

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ సీఐగా వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన తరువాత సంబేపల్లె పీఎస్‌ను తనిఖీ చేశారు. ఈయన గతంలో వీరబల్లె, రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐగా పని చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇక్కడ నుంచి పదోన్నతి పొందిన తరువాత ఆయన జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లి అక్కడ నుంచి లక్కిరెడ్డిపల్లె సీఐగా వెళ్లారు. అక్కడ నుంచి ఎన్నికలు పూర్తయిన తరువాత జిల్లా కేంద్రంలో పని చేస్తూ రాయచోటి రూరల్ సీఐగా వచ్చారు.

లక్కిరెడ్డిపల్లి సీఐగా వెంకట కొండారెడ్డి



లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి సీఐగా వెంకట కొండారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన సత్యసాయి జిల్లా పుట్టపర్తి నుంచి బదిలీ నిమిత్తం లక్కిరెడ్డిపల్లికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన జీవన్ గంగనాథబాబు బదిలీపై పులివెందులకు వెళ్లారు. అనంతరం సీఐ వెంకట కొండారెడ్డికి ఎస్ఐ రవీంద్రబాబుతోపాటు సర్కిల్ పరిధిలోని రామాపురం, గాలివీడు మండలాల ఎస్ఐలు, లక్కిరెడ్డిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేశారు.

23న గ్రామ సభలు

వీరబల్లి : మండలంలో ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులపై కచ్చితంగా ఈనెల 23వ తేదీన నిర్వహించాలని ఎంపీడీఓ మల్లేశ్వరీ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ సచివాలయం దగ్గర గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహించాలని ఆమె సూచించారు.

25 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట – సిద్దవటం మార్గ మధ్యలో ఉన్న పరమాత్మాసేవా తపోవన వృద్ధాశ్రమం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీ అన్నపూర్ణ సమేత ఆదిబిక్షు ఆలయంలో ఈనెల 25వ తేదీ నుంచి 29వ తేదీ వరకు విగ్రహప్రతిష్ట మహోత్సవం పూజలు జరుగునని ఆలయ నిర్వాహకులు మలిశెట్టి వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్రమ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

సిద్దవటం : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే అట్టి వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సీఐ నాగరాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని నేకనాపురం, వడ్డివారిపల్లె, పెద్దపల్లి గ్రామాల్లో అనుమానితుల దుకాణాల్లో తనిఖీలు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం అక్రమంగా అమ్మితే ప్రజలు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

వీరబల్లి : మండలంలో మట్లి పంచాయతీలోని కోదండరామ దేవాలయం దగ్గర మాండవ్య నది నుంచి అక్రమంగా మంగళవారం రాత్రి ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు స్థానిక ఎస్ఐ మోహన్ నాయక్ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇకపై ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే ఆటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థినులకు అభినందన

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు క్రికెట్‌లో ప్రతిభ చాటారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు డి.భాను, ఎం. షారా ఇటీవల తమిళనాడులో జరిగిన ఫోర్త్ నేషన్స్ మినీ టెన్నిస్ బాల్ క్రికెట్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొన్నారు. టోర్నీలో జట్టు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను జట్టును క్వార్టర్స్‌కు చేర్చారు. మహారాష్ట్రతో జరిగిన క్వార్టర్స్ ఫైనల్స్ ఆంధ్రప్రదేశ్ జట్టు ఓటమి చెందింది. అయినా విద్యార్థినులు విశేషంగా రాణించడంతో జిల్లా వీరు నవంబర్‌లో జమ్మూ కశ్మీర్‌లో జరిగే నేషనల్ మీట్‌లో రాష్ట్ర జట్టులో పాల్గొంటారని ప్రిన్సిపల్ తెలియజేశారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లైసెన్స్ తప్పనిసరి

సిద్దవటం : వాహనాలు నడిపేవారికి లైసెన్స్ ఉండాలని ఎస్ఐ చిరంజీవి తెలిపారు. సిద్దవటం శివారులోని ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద బుధవారం సాయంత్రం ఎస్ఐ తన సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ధృవపత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదన్నారు. హెల్మెట్ ధరించాలని, వేగంగా నడపవద్దని పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట గ్రామ పొలాల్లో బుధవారం పేకాట ఆడుతున్న వారిని బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వచ్చిన సమాచారంతో ఒంటిమిట్ట గ్రామ పొలాల్లో జూదం ఆడుతున్న పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 8 వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అధిక ఎరువుల వాడకంతో అనర్థాలే

- సేంద్రియ వ్యవసాయంతో అనేక లాభాలు
- వ్యవసాయాధికారుల సూచనలతో సాగు చేయడం ఉత్తమం
- మోతాదుకు మించి ఎరువుల వినియోగంతో భూమి నిస్సారం


వరి పంటకు యూరియా వేస్తున్న రైతు

సిద్దవటం : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు వరి పంటను ముమ్మురంగా సాగు చేస్తున్నారు. అయితే పంటల సాగులో ఎరువులదే కీలక పాత్ర. ఏ ఎరువు ఎంత మోతాదులో వేయాలి, ఎంత వేస్తే అశించిన దిగుబడులు వస్తాయనే విషయం తెలియక చాలా మంది రైతులు ఇష్టానుసారంగా ఎరువులు వేస్తుంటారు. దీని వల్ల కలుపు విపరీతంగా పెరుగుతుందే తప్ప దిగుబడులు రావు. అలాగే పంట కోసం పెట్టిన పెట్టుబడులు కూడా రావు. పక్క రైతులు అధికంగా ఎరువులు వేస్తుంటే వారి చూసి మిగతా వారు కూడా అంతకు మించి ఎరువులు వేస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు అధికంగా వేయరాదని సిద్దవటం వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి తెలిపారు. తగిన మోతాదులో వేసుకుంటే పంట దిగుబడులు పెరగడమే గాకుండా భూములు నిస్సారమైపోకుండా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. భూసార పరీక్షలు చేయించుకొని అందుకు తగ్గట్టు వ్యవసాయాధికారులను గాని, శాస్త్రవేత్తలను గాని సంప్రదించి ఎరువులు వేసుకుంటే ఆదాయం లభిస్తుంది. భూమిలో పోషక పదార్థాలను గుర్తించి పంటలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు వేసుకుంటే మేలు జరుగుతుంది. నేల స్వభావం, భూమిలోని పోషక పదార్థాలను అనుసరించి ఎరువులు వేసుకుంటే పంట పండుతుంది.

నేల స్వభావాన్ని బట్టి ఎరువులు..

నేల స్వభావానికి అనుగుణంగా వివిధ పంటలకు కావలసిన రసాయనిక ఎరువులను ఎంపిక చేసుకోవాలి. ఆమ్ల భూములైతే ఆమ్లత్వం కలిగిన ఎరువులను ఉపయోగించకూడదు. సమస్యాత్మక నేలల్లో వివిధ పంటలు సాగు చేసేటప్పుడు ఆమ్ల భూమలులైతే సున్నం, క్షార భూములైతే జిప్సం భూసార పరీక్షలకు అనుసరించి ఉపయోగించుకోవాలి. ముఖ్యంగా చౌడు భూముల్లో చౌడు స్థాయిని బట్టి జిప్సం వేసుకోవాలి. పరోక్షంగా ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి వివిధ సూక్ష్మ పోషకాలు అందుబాటులోకి వస్తాయి. బంకమట్టి రేణువుల స్వభావాన్ని బట్టి సిఫార్సు చేసిన నత్రజని ఎరువులను ఎన్ని ధపాలుగా వేయాలో ఆధారపడి ఉంటుంది.

ఎరువుల ఎంపిక చాలా కీలకం

వాతావరణ పరిస్థితులకు అనువైన రకాలను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని వరి రకాలను బట్టి నత్రజని ఆవశ్యకత ఆధారపడి ఉంటుంది. ఆహార దుంపజాతి పంటలకు నత్రజని ఎరువులు అవసరం ఎక్కువగా ఉంటుంది.

సమతుల్యత

తేలిక నేలల్లో అయితే సేంద్రియ రసాయనిక ఎరువులు 40:60 నిష్పత్తిలో, బరువు నేలల్లో అయితే 30:70 నిష్పత్తిలో వేసి సమతుల్యతను పాటించాలి. రసాయనిక ఎరువులతోపాటు సేంద్రియ ఎరువులను కలిపి వేయడం వల్ల భూముల వినియోగ సామర్థ్యం పెరుగుతుంది. వివిధ సూక్ష్మ పోషకాలు మొక్కలకు అందుబాటులోకి వస్తాయి. వివిధ వ్యవసాయ వ్యర్థాలను కంపోస్టుగా మార్చి ఉపయోగించినప్పుడు యూరియా వంటి ఎరువుల సామర్థ్యం, నత్రజని లభ్యత పెరుగుతుంది.

ఎరువుల వాడకంలో జాగ్రత్తలు వహించాలి



రైతులు రసాయనిక ఎరువులు, పురుగుల మందుల వాడకంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి. మాస్క్, గ్లౌజులు వాడాలి. ఎరువులు చల్లడం పూర్తయిన తరువాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కొని ఆహార పదార్థాలు తీసుకోవాలి. రసాయనిక ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించాలి. ప్రకృతి వనరులను సద్వినియోగం చేసుకోవాలి. తద్వారా పెట్టు బడి వ్యయాన్ని గణనీయంగా తగ్గించి, నికర ఆదాయం పెంచుకోవచ్చు.

– కె.రమేష్‌రెడ్డి, వ్యవసాయాధికారి, సిద్దవటం

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ దృశ్యం

చిట్వేలి : చిట్వేలి – మంగళంపల్లి రహదారిలో నూతనంగా నిర్మించిన శ్రీ పార్వతీ పరమేశ్వర శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి శిలా బింభ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ బుధవారం వరకు వైభవంగా నిర్వహించారు. ప్రతిష్ఠ పూజల్లో భాగంగా బుధవారం తెల్లవారుజామున యంత్ర ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని కనుల పండుగలా నిర్వహించారు. పూజల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మీలు పాల్గొన్నారు. వీరిని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి మఠం, కందిమల్లయ్యపల్లి నుంచి ముఖ్య అతిథులుగా బ్రహ్మశ్రీ వెంకటాద్రి స్వామి, కుమారస్వాములు పాల్గొన్నారు. దాత సహకారంతో మూడురోజులపాటు మూడు పూటలా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ నిర్మాత, ధర్మకర్త కట్టా రామ్మోహన్ రావు, కార్యనిర్వాహకులు మహోత్సవాలను విజయవంతంగా జరిపించారు.

లేఔట్‌లకు అనుమతులు తప్పనిసరి

రాయచోటి అర్బన్ : రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో అనుమతులు తీసుకోకుండా లేఔట్లు వేయరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ ఎస్.వాసుబాబు తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్, గవర్నమెంట్ ఆఫ్ ఏపీ ఆదేశాల మేరకు రాయచోటి పురపాలక సంఘం పరిధిలోని అనధికార లేఔట్లపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పురపాలక పరిధిలోని కస్పా గొల్లపల్లె సర్వే నం. 1/1లోని 60 ఎకరాలు, సర్వేనం. 34లోని 2 ఎకరాలు, రాయచోటి గ్రామంలోని సర్వేనం. 527, 528, 534లోని 2.17 ఎకరాలు, సర్వేనం.671లో 2.56 ఎకరాలలో అనధికార లేఔట్లు వేశారన్నారు. సర్వేనంబరు 527లో 2 ఎకరాలు, 547లో 3.16 ఎకరాలు, 238లో 2.60 ఎకరాలు, 589లో 1.96 ఎకరాలలో అనధికార లేఔట్లు వేశారన్నారు. సర్వే నంబరు 881, 882లో 1.38 ఎకరాలు, 238లో 2.60 ఎకరాలు, మాసా పేట గ్రామం సర్వే నం. 170లో 6 ఎకరాలు, 172లో 2.15 ఎకరాలు అనధికార లేఔట్లుగా వేశారన్నారు. సదరు సర్వే నంబరులలో స్థలాలు కొనుగోలు చేయడం చట్టవిరుద్ధం అన్నారు. ఈ ప్లాట్లకు అమ్మకం, కొనుగోలుకు వీలు లేదన్నారు. ముఖ్యంగా భవన నిర్మాణానికి అనుమతులు మంజూరు కావన్నారు. మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించబడవంటూ తెలిపారు.

చర్చి ఆస్తుల పరిరక్షణకు అండగా ఉంటాం


బాధితులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ప్రఖ్యాత లూథరన్ చర్చి ఆస్తుల పరిరక్షణకు అండగా ఉంటామని వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి బుధవారం తెలిపారు. క్రైస్తవ నాయకులు, బాధితులతో కలిసి చర్చి కాంపౌండును, బంగ్లాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అర్ధరాత్రి రణరంగం సృష్టించి భయభ్రాంతులకు గురి చేయడం సమంజసంకాదని తెలిపారు. ప్రభుత్వం, అధికారులు చర్చి ఆస్తులను కాపాడాలని కోరారు. గత 10 సంవత్సరాలు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు చర్చి ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడుతూ వచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఇలాంటి దౌర్జన్యాలను ప్రోత్సహించకూడదని తెలియజేశారు. వెంటనే చర్చి ఆస్తులను ధ్వంసం చేసినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మందల నాగేంద్ర, సీహెచ్ రమేష్, బత్తల భాస్కర్, రత్నం, చంద్రా తదితరులు పాల్గొన్నారు.

వైద్యసిబ్బంది రక్షణకు చట్టం చేయాలి


రాయచోటి అర్బన్: బస్టాండు సర్కిల్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న సీఐటీయూ నేతలు, కార్యకర్తలు


పుల్లంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : దేశవ్యాప్తంగా వైద్యసిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మీలు డిమాండ్ చేశారు. కలకత్తా హత్యాచార సంఘటనను నిరసిస్తూ బుధవారం సాయంత్రం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండు సర్కిల్‌లో నిరసన ప్రదర్శన జరిగింది. వారు మాట్లాడుతూ పశ్చిమబెంగాల్ ప్రభుత్వం హత్యాచార కేసులో నిందితులను రక్షించేందుకు ప్రయత్నిస్తోందన్న విషయం సుప్రీంకోర్టు ప్రశ్నలతో స్పష్టమైందన్నారు. కలకత్తాలో ఆర్‌జీ కార్ వైద్యకళాశాలలో జరుగుతున్న ఘోరాలు బయటకు రాకూడదనే ఉద్దేశంతోనే వైద్య విద్యార్థినీని హతమార్చడంలో భాగంగానే అత్యాచారం చేశారన్న అనుమానాన్ని వారు వ్యక్తం చేశారు. ఆసుపత్రిపై మూకదాడిని ప్రోత్సహించిన రాజకీయ నేతలతోపాటు దాడి చేసిన వారిని ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేయాలన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీల ఏర్పాటు చేయాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు సిద్దమ్మ, విజయమ్మ, శంకరమ్మ, సుహాసిని, హాజీరా పాల్గొన్నారు.

పుల్లంపేట : కలకత్తా వైద్య విద్యార్థి హత్యాచార ఘటనపై బుధవారం పుల్లంపేటలోని శ్రీ శివ పార్వతీ స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఆడబిడ్డలను గౌరవిద్దాం, ఆడబిడ్డలను బతికిద్దాం, ఆడపిల్లలపై హత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎయిడ్స్ రహిత సమాజమే లక్ష్యం


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి

వీరబల్లి : నేటి సమాజం నుండి ఎయిడ్స్ మహమ్మారిని పారదోలుదామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజంతుల్లా తెలిపారు. ఎయిడ్స్ నివారణ పైన స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ అయిన పీసీఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ముఖ్యంగా యువతీ, యువకులకు అవగాహన అవసరమన్నారు. ఎయిడ్స్ రహిత స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం పీసీఎస్ఎస్ ప్రాజెక్టు మేనేజర్ స్వాతి మాట్లాడుతూ రక్తం, తల్లిపాలు, వీర్యం, యోని స్రవలలో హెచ్ఐవీ వ్యాప్తిస్తుందన్నారు. ముద్దులు, కౌగిలింతలు, ఆహారం పంచుకోవడం వంటి అలవాట్లు ద్వారా వ్యాపించదని తెలిపారు. ఈ వ్యాధి వచ్చినప్పుడు జ్వరం, తలనొప్పి, దద్దుర్లు, గొంతునొప్పి, ఇన్ఫెక్షన్లు కనబడుతాయని, అలానే క్రమంగా రోగనిరోధక శక్తి బలహీనపడి మనిషి సన్నగా అవుతారని చెప్పారు. ఈ లక్షణాలు ఉన్నవారు దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య చికిత్సా కేంద్రానికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ రఘురామయ్య, అధ్యాపకులు, సిబ్బంది, ఎన్ఎస్ఎస్‌పీఓ శ్యామ్ సుందర్ రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట డీఎస్పీగా సుధాకర్



రాజంపేట : రాజంపేట డీఎస్పీగా ఎన్.సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది. 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలో ఎస్ఐగా వైఎస్సార్ జిల్లాలో పలుచోట్ల పనిచేశారు. డీఎస్పీగా ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేశారు. ప్రస్తుతం కడప స్పెషల్ బ్రాంచి డీఎస్పీగా ఉన్న సుధాకర్‌ను రాజంపేట డీఎస్పీగా బదిలీ చేసింది.

లేటరల్ ఎంట్రీ ఐఏఎస్‌ల భర్తీ రాజ్యాంగ విరుద్ధం

రాయచోటి అర్బన్ : లేటరల్ ఎంట్రీ పేరుతో ఆర్ఎస్ఎస్, ప్రైవేటు వ్యక్తులతో ఖాళీ ఐఏఎస్ పోస్టులను భర్తీచేయడం మనువాద, మతోన్మాద కుల అహంకార చర్య అని కేవీపీఎస్ అన్నమయ్య జిల్లా కన్వీనర్, కో – కన్వీనర్‌లు పెంచలయ్య, డీసీ వెంకటయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పక్కన పెట్టి లేటరల్ పేరుతో దొడ్డిదారిన బీజేపీ అనుబంధ సంస్థలకు చెందిన వ్యక్తులను నింపేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే ఆపాలన్నారు. కేంద్రమంత్రిత్వ శాఖలలో లేటరల్ పద్ధతిలో జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ వంటి 45 పోస్టులను భర్తీ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి కీలక స్థానాల్లో ఆర్ఎస్ఎస్ భావజాలం ఉన్న మనుష్యులతో నింపేందుకు, రిజర్వేషన్లను పూర్తిగా తిరస్కరించేందుకు మతోన్మాద బీజేపీ ప్రభుత్వం ఈ లేటరల్ ఎంట్రీ సిస్టంను ఎంచుకుందన్నారు. బీజేపీ ఎంచుకున్న విధానంపై రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేటరల్ ఎంట్రీ నియామకాలను ఆపాలంటూ వారు డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన నేతలు



రైల్వేకోడూరు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న కొరముట్ల



సుండుపల్లె: వైఎస్ జగన్‌తో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి, మండల నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని జెడ్పీటీసీలతో కలిసి ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి క్యాంప్ ఆఫీసులో కలిసి పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్ రెడ్డి, చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జెడ్పీటీసీలు రత్నమ్మ, సుబ్బరాయుడు, చంద్ర, విక్రమ్ రాజు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుండుపల్లె : విజయవాడలోని తాడేపల్లి వైఎస్సార్‌సీపీ క్యాంపు ఆఫీసులో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుల ఆత్మీయ సమావేశంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామస్వామిరెడ్డి మాట్లాడుతూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథరెడ్డితోపాటు సుండుపల్లె జెడ్పీటీసీ షేక్ ఇస్మాయిల్‌లు పాల్గొని పలు విషయాలపై చర్చించినట్లు తెలియజేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

సంబేపల్లె : విద్యార్థులు చిన్ననాటి నుంచే ఇతరులతో పోటీపడినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో 6, 7, 8 విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ పుస్తకాలను అందజేశారు.

ఆదమరిస్తే అంతే సంగతులు


మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

పుల్లంపేట : మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డు గుంతగా ఉండటంతో చినుకుపడితే చాలా వర్షపునీరు చెరువును తలపిస్తోంది. ఈ మార్గాన ద్విచక్రవాహనంపై వెళ్తున్నప్పుడు ఆదమరిస్తే అంతే సంగతులు అన్నట్టుగా వర్షపునీరు నిల్వ ఉంది. ఎందుకంటే వర్షపునీరు ఎక్కువగా ఉండటంతో రోడ్డుపై ఎక్కడ గుంత ఉందో ఎక్కడ రాయి ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వృద్ధులు ఈ మార్గన నడవాలంటే మరో వ్యక్తి తోడుగా చేయి పట్టుకొని తీసుకెళ్లాల్సిందే. రోడ్డంతో వర్షపునీటితో బురదమయం కావడంతో విద్యార్థులు సైతం పలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. అంతేకాక గుంతలలో వర్షపునీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది ప్రజలను కుడుతుండటంతో వాటి బారిన పడి పలువురు ఆసుపత్రి పాలవుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపి రోడ్డు ఎత్తును పెంచి వర్షపునీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రశాంతంగా వర్గీకరణ వ్యతిరేక భారత్ బంద్


రాజంపేట: భారత్‌బంద్ నిర్వహిస్తున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు

నందలూరు : ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘ సమితి పిలుపు మేరకు నందలూరులో భారత్ బంద్‌ను దళిత వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనలు, పాఠశాలల బంద్ శాంతియుతంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రాజ్యాంగ నిర్మాత డా.బీ.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, సూర్యనారాయణ, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, మోడపోతుల సుధాకర్, ఎముక దుర్గయ్య, సురేష్, తుమ్మాది శివకుమార్, బలరాం, శివ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు

రాజంపేట : నియోజకవర్గంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన భారత్‌బంద్ ప్రశాంతంగా కొనసాగింది. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో భారత్ బంద్‌ను వివిధ పార్టీలకు చెందిన దళిత నాయకులు, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నేతలు చేపట్టారు. వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దళితులు ఐక్యతే ముద్దంటూ ర్యాలీగా పట్టణంలో కలియతిరిగారు. పలు విద్యాసంస్థలను మూసివేయించారు. ఆందోళనలు వద్దంటూ కేవలం శాంతియుతంగా బంద్‌ను నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా దళిత ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. బంద్‌లో అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, దళిత నేతలు జోరేపల్లె భాస్కర్, లింగంసంజీవ్, కొమ్మా ఎల్లయ్య, శాంతయ్య, గోసాల దేవి, ఇరువూరి శివయ్య, పందికాళ్ల జయరాం, శెట్టిపల్లె శేఖర్, మోడపోతుల వెంకటరమణ, జోరపల్లె హరి, సిగమాల రమణ, బాలచంద్ర, కొరముట్ల హరి తదితరులు పాల్గొన్నారు.


నందలూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

సేవల విస్తరణకు దాతలు సహకరించాలి


శాంతి ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, సంస్థ సభ్యులు

సుండుపల్లె : మండల కేంద్రంలో మానవత చైర్మన్ మిన్నంరెడ్డి గంగిరెడ్డి ఆధ్వర్యంలో మానవత వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శాంతి ర్యాలీ ఎంకెఆర్ జూనియర్ కళాశాల, లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులతో మానవత సభ్యులు ముత్తూట్ ఫైనాన్స్ బ్యాంకు వరకు శాంతి ర్యాలీ నిర్వహించి నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా ఎంఈఓలు వెంకటేష్ నాయక్, రవి నాయక్, మండల ఎస్ఐ శ్రీనివాసులు హాజరయ్యారు. మానవత సేవ కార్యక్రమాలు నిర్వహించేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు మహబూబ్ బాషా, హరికుమార్, భగవాన్, రవీంద్రనాథ్‌రెడ్డి, నాగేశ్వరరావు, నటేష్, సుబ్రమణ్యం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పుల్లంపేట : నేడు గురువారం ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఘురాం తెలిపారు. ఈ సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు హాజరుకావాలని ఆయన కోరారు.